

కథా కౌముది

# ఇల్లు

దీప్తి వల్మీకం

అర్చన కార్ పార్క్ చేసి కాఫీ షాప్ లోకి వెళ్ళింది. చుట్టు చూసి "చాలా మారిపోయింది" అని మనసులో అనుకుంది కూర్చోబోతు.

అదొక చిన్న టౌన్. దానిలో కలిసిపోయినట్టు ఉండె ఒక ఫ్యాక్టరి తాలుకు క్వార్టర్స్. ఆ ప్రాంతానికి ఎం జి కాలని అని పేరు.

అది అర్చనకి అమ్మమ్మ గారి ఊరు. తాతగారు ఆ ఫ్యాక్టరి గుడిలో పూజారి గా పని చేసినప్పుడు క్వార్టర్స్ లో ఉండే వాళ్ళు. ఆ ఇల్లు తనకెంతో ఇష్టమైన ఇల్లు. ప్రతి అణువణువు తెలుసనే నమ్మకం అర్చనకి. ఇప్పటికీ కళ్ళు మూసుకొని ప్రతీ గది, వాటిలో వస్తువులు ఏవి ఎక్కడ ఉండేవో అన్నీ చెప్పగలదు. అమ్మ పెద్ద కూతురు. తరవాత మామలు, పిన్నులు చాలామందే ఉన్నారు కాని వాళ్ళ పిల్లలు ఈ ఇంట్లో గడిపింది తక్కువే. అమెరికా వెళ్ళే ముందు ఒక సారి చూడాలని అనిపించింది తనకి. మళ్ళీ ఎప్పుడు చూస్తుందో, అసలు చూస్తుందో లేదో అని అనుమానం.

అర్చన ఒక్కర్తే కూతురు వాళ్ళ అమ్మ, నాన్నలకి. చాలా గారాబంగా పెరిగింది. ప్రతి సెలవలకి అమ్మమ్మ ఇంటికే వచ్చేది. గుడిలో గంటలు, గంటలు కూర్చోవడం, పక్కన ఉన్న తోటలో తిరగడం, హారతి సమయానికి గంటలు మోగించడం, ఇదే పని. స్నేహితులెవరు లేరు పెద్దగా, అర్జున్ తప్ప.

గుడినించి, ఇంటిని వెనకనుంచి కలుపుతు ఒక చిన్న దారి.  అక్కడ ఒక గేటు. దాని పైన రాధకృష్ణ పూల తీగ . అది దాటి లోపలికి వస్తే కొంచం ఖాళీ స్థలం. ఎండాకాలంలొ అక్కడే పడుకునెవాళ్ళు. అటుపక్కన, ఇటుపక్కన రకరకాల చెట్లు. చిన్న తోట, పెద్ద తోట అని పేరు వాటికి. ఖాళి స్థలం దాటితే గచ్చు. అక్కడొక పందిరి పైన పాకిన తీగ సంపెంగ. తోటలో కరివేపాకు, సీతాఫలం, కొబ్బరి, జామ చెట్లు, పారిజాతం, డిసెంబర్ పూలు, సదామల్లె, నూరు వరహాలు ఇంక ఎన్నో ర

కాల పూల చెట్లు ఉండేవి. ఆ చెట్లకింద ఎన్ని పగళ్ళు పుస్తకాలు చదువుతూ గడిపిందో తనకే తెలుసు. చందమామ, బాలమిత్ర , బొమ్మరిల్లు అద్దెకి తెచ్చుకొని చదివేయటం, వెంటనే తిరిగి ఇచ్చేసి షాప్ వాడికి కోపం తెప్పించడం ఇంక గుర్తే.

ఆ ఇల్లు, అందులో ప్రతీ చెట్టు, ప్రతీ కొమ్మ, ప్రతి రెమ్మ నావే, నావే అని అరిచి చెప్పాలని అనిపిస్తుంది అర్చన కి. కాని ఆ ఇల్లు ఫ్యాక్టరిది. ఎవరికీ లేని ప్రేమ తనకెందుకో తనకే అర్థం కాదు.

ఎవరో తననే చూస్తున్నట్టు అనిపించి ఆలోచనల్లోంచి బయటకి వచ్చి చుట్టూ చూసింది. అర్జున్ కాఫి తాగుతూ తనవైపే చూస్తున్నాడు. సంతోషం పట్టలేక పరిగెత్తి వెళ్ళింది ఆ టేబుల్ దగ్గరికి,

"అర్జున్ నువ్వేంటి ఇక్కడ" అంటూ. అర్జున్ లేచి అర్చనను దగ్గరికి తీసుకున్నాడు "గుర్తు పట్టవనుకున్నాను" అంటూ. అర్చనకి ఒక్కసారిగా ప్రపంచం ఆగిపోయినట్టు, కాలం గిర్రున వెనక్కి తిరిగినట్టు ఉంది.

"ఇది కలా, నిజమా అర్జున్?"

"నిజం, కలలాంటి నిజం. నువ్వేంటి ఇక్కడ? ఇన్ని సంవత్సరాల తరవాత" అన్నాడు అర్జున్.

"అమెరికా వెళ్ళిపోతున్నాను అర్జున్, ఒకసారి తాతగారి ఇల్లు చూడాలని అనిపించింది"

అర్జున్ కళ్ళలో సంతోషం, బాధ ఒకేసారి తొంగిచూసాయి.

"నీకొక విషయం తెలుసా? ఇప్పుడు ఆ ఇంట్లో నేనే ఉంటున్నాను. ఫ్యాక్టరిలో ఇంజనీయర్ని" అన్నాడు.

పిచ్చెక్కినంత పనైపోయింది అర్చనకి.

"అవునా...ఓ అర్జున్...ఐ యాం సో హాపి. నేను ఒకరోజు ఉండిపోవచ్చా?" అంది అర్చన, అని నాలుక కరుచుకుంది. "సారి, మీఆవిడకి ఓకె అయితేనే" అంటూ.

నవ్వేసాడు అర్జున్, "ఏమి పర్లేదు, పద వెళ్దాం" అని లేస్తూ.

గుండె వేగం పెరిగింది అర్చనకి ఇంటిదగ్గరికి చేరుతూనే. కార్ ఆగకుండానే కిందికి దిగింది అర్జున్ వారిస్తున్నాకూడా.

"దేవుడు ఉన్నాడు అర్జున్, ఉన్నాడు. ఇక్కడికి వచ్చి ఈ ఇంట్లో వాళ్ళని ఏమని అడగాలో, ఏమని మాట్లాడాలో ఏమి ఆలోచించలేదు, వచ్చేసాను, అంతే. నువ్వు ఉండటం ఎంత విచిత్రం"

"నిజమే, ముందు లోపలికి వెళ్దాం రా"

"లేదు, గుడి వైపు నుండి వద్దాం రా" అంది అర్చన చెయ్యి పట్టుకొని లాగుతూ.

"సరే పద" అన్నాడు అర్జున్ తన వెనకే నడుస్తూ.

గుడి మెయిన్ గేట్లోనుండి ఇంటివైపు చిన్న దారిలోకి నడిచారు ఇద్దరు. గుడి పక్కన ఒక మండపం, రామనవమికి కళ్యాణం అక్కడే జరిగేది. రెండడుగులు వేస్తే ఒక డ్రామా స్టేజి, పక్కన కొన్ని రూములు ఏవైన శుభకార్యాలకి అద్దెకి ఇవ్వటానికి. వాటి గురించి అర్జున్ కి చెప్తూ నడిచింది అర్చన.

చిన్న గేట్ పైన రాధాకృష్ణ పూలతీగ ఇంకా పెద్దగా పెరిగింది.

“ఇరవై సంవత్సరాలు" అనుకుంది అర్చన నిట్టూరుస్తూ. గేట్ దాటగానే ఉండాల్సిన ఖాళీ స్థలంలో ఏవో పనికిరాని వస్తువులు, తోటలో కొన్నే చెట్లు ఉన్నాయి. మనసంతా ఏదోలా అయిపోయింది అర్చనకి.

"బాధగా ఉందా? కొంచం క్లీన్ చేయిస్తే సరిపోతుంది" అన్నాడు అర్జున్.

అవునన్నట్టుగా తలాడించింది అర్చన.

ఇల్లు కూడా లోపల మారిపోయింది. శుభ్రంగా, పొందికగా ఉంది. హాల్ అలానే ఉంది కాని మంచి సోఫా సెట్ ఇంకా అందాన్ని ఇచ్చింది రూంకి. పైన రేకుల బదులు సిమెంట్ స్లాబ్ అయ్యింది. వంటిల్లు కొత్త రూపు తెచ్చుకుంది.

"చాలా బావుంది" అంది అర్చన మెచ్చుకోలుగా. "మీ ఆవిడ చాలా చక్కగా అలంకరించింది".

గట్టిగా నవ్వేసాడు అర్జున్, "నేనే మా ఆవిడ" అన్నాడు.

"పెళ్ళి చేసుకోలేదూ?" అంది ఆశ్చర్యపోతూ.

సమాధానం చెప్పలేదు అర్జున్. "ఫ్రెష్ అయ్యి రా అర్చనా, డిన్నర్ చేద్దాం" అన్నాడు.

ఇద్దరు కలిసి సింపుల్గా అన్నం, వంకాయ కూర, పప్పు తో వంట ముగించారు.

"కాసేపు బయట కూర్చుందామా?" అని అడిగింది అర్చన. ఇద్దరూ తోటల మధ్య గచ్చు మీద కుర్చీలు వేసుకొని కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పు. అమెరికా ఎప్పుడు వెళ్తున్నావు?"

"ఇంకో రెండు వారాల్లో. అమ్మ, నాన్నా లేరు, ఇక్కడ ఇంకేం లేదేమో అర్జున్" అంది గొంతులో ఏదో అడ్డుపడుతున్నట్టుగా.

"మరి నేను?" అని పైకి అనలేదు అర్జున్.

అర్జున్,అర్చన చిన్ననాటి స్నేహితులు, అనుకోకుండా ఇంజనీరింగ్ కాలేజి లో మళ్ళీ కలిసారు, ఇష్టపడ్డారు కాని పరిస్థితుల కారణంగా విడిపోయారు. పెళ్ళిని పోస్ట్ పోన్ చేస్తూ గడిపారు. మళ్ళీ కలుస్తారనుకోలేదు.

"ఈ ఇల్లు నేను కొనుక్కున్నాను తెలుసా అర్చన!" అన్నాడు అర్జున్ హటాత్తుగా.

"అవునా, ఎప్పుడు? ఎలా? ఫ్యాక్టరి వాళ్ళు అమ్మరు కదా"

"ఈ మధ్య కొంత నష్టాల్లో పడితే ఉద్యోగులకి ఆఫర్ ఇచ్చారు కొనుక్కొనమని, మైంటనన్స్ బాధ్యత తగ్గించుకోవటానికి" చెప్పాడు అర్జున్.

"ఈ ఇంట్లో ఉంటే నీ పక్కన ఉన్నట్టు ఉంటుందని వెంటనే కొన్నాను. నీకు ఈ ఇల్లు ఎంత ఇష్టమో నాకు తెలుసు. ఈ ఇంట్లో ఎక్కడ ఏ రూం లో ఉన్నా, నువ్వు చెప్పిన ఎదో ఒక విషయం గుర్తు వస్తుంది అర్చన. నువ్వు లేవు కాని నీ జ్ఞాపకాలు చాలనుకున్నాను" బాధగా చెప్పాడు.

"అర్జున్, అందరికి వాళ్ళ చిన్నప్పటి ఇల్లంటే ఇష్టం ఉంటుంది, కాని, నాకేంటో ఈ తాతగారి ఇల్లంటే ఇష్టం. నాస్టాల్జియా కావొచ్చు. గడిచిపోయిన కాలంలో ఏదో సంతోషం. అంతేనంటావా?" అంది అర్చన సాలోచనగా.

"కాని ఒక్కసారి చూసి వెళ్దాం అనుకొని, ఒకరోజు ఉండటం మాత్రం అదృష్టమే" అంది.

"అర్చనా, ఒక్కరోజు కాదు, ఇక్కడే నాతో ఉండిపోవా? ఈ ఇల్లు నీది, నేనూ నీవాడినే, ప్లీజ్" అన్నాడు అర్జున్.

"ఇప్పుడు ఒకరు మన పెళ్ళికి ఒప్పుకోవాలనే అవసరం కాని, ఆలోచన కాని నాకు లేవు. అసలు పెళ్ళే కావాలనే కోరికా లేదు. నువ్వంటే చాలు. నీకిష్టమైనన్ని రోజులు. నిన్ను బలవంతపెట్టను. నాకు ఇక్కడ జాబ్ రావటం, ఈ ఇల్లు అమ్మకానికి రావటం అంత ఏదొ ఒక కారణం లేకుండా జరగదని నాకు అనిపించేది, అదే ఇప్పుడు నిజం అయ్యింది. ఈ పదిహేను సంవత్సరాలు ఇప్పుడొక పదిహేను నిమిషాలలాగా అనిపిస్తున్నాయి".

అర్చన లేచి అర్జున్ దగ్గరగా కూర్చుని, అతని ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని కళ్ళలోకి చూస్తూ "మరి నా ఉద్యోగం?" అంది. కాని అతన్ని హత్తుకోకుండా, చుంబించకుండా ఉండలేకపోయింది. కాలం ఆగిపోయింది, మధ్యలో ఆగిపోయిన కథని పూర్తి చేయడానికా అన్నట్టు.

"నీ ఇష్టమే నా ఇష్టం, నీకోసం ఎదురుచూస్తాను, తిరిగి రావటం, రాకపోవటం నీ ఇష్టం. నువ్వు ఈ ఇల్లే కావాలంటె నీకే అమ్మేస్తాను"

"లేదు అర్జున్, నువ్వే కావాలి. నువ్వు ఉంటావని, నీతో ఈ ఇంట్లో ఉండాలని రాసిపెట్టి ఉన్నందుకే నాకు అంత పిచ్చి ప్రేమేమో ఈ ఇల్లంటే. ఇప్పుడే, ఈ క్షణమే పెళ్ళి చేసుకుందాం. అమెరికా వెళ్తాను కాని తొందరగా తిరిగి వచ్చేస్తాను. తరవాత ఈ ఇంట్లోనే ఉందాం, తోట బాగుచెయ్యాలి, ఇంట్లొ కొన్ని రిపేర్స్ చేయించాలి, ఇంకా ఎన్నో.. .మన రిటైర్మెంట్ ఇక్కడే" అంది అర్చన. తాతగారి ఇల్లు ఇప్పుడు తన ఇల్లు.

Click here to share your comments